## మున్సిపాల్టీల పరిధిలో ఉద్యోగులకు నేడు సెలవు
**కలెక్టర్ మనుచౌదరి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లాలో మూడు మున్సిపాల్టీల్లో (అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట్) బుధవారం ఎన్నికలు జరుగుతున్నందున ఆయా మున్సిపాల్టీల్లో ఓటు హక్కు కల్గి ఉన్నవారు ఓటు వినియోగం కోసం ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ప్రకటించారు. మంగళవారం ఆయన పేర్కొంటూ మున్సిపల్ మిగతా 2లో



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# ఆఖరి అంకానికి
# అంతా సిద్ధం
## నేడు మున్సిపోల్
### పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది


ఎన్నికల సామాగ్రిని తరలిస్తున్న సిబ్బంది


షాద్‌నగర్‌లో అధికారుల హడావుడి


పోలింగ్ కేంద్రాలకు పయనం

**షాద్‌నగర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా ఎన్నికల అథారిటీ అధికారి సునీతా రెడ్డి ఆధ్వర్యంలో విధుల కేటాయింపు జరిగింది. 28 వార్డులకు సంబంధించి 53, 403 ఓటర్లకు గాను 76 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు సునీతా రెడ్డి తెలిపారు. 300 మందికి పైగా పీవోలు, ఏపీవోలు, ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆర్డీవో సరిత సమక్షంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్నికల సిబ్బంది బాక్సులు తీసుకొని ఎన్నికల విధి నిర్వహణకు తరలివెళ్లారు. మరోవైపు పోలీసులు కూడా 28 వార్డుల్లోనూ భారీ బందోబస్తుకు ఏర్పాటు చేశారు. డిసిపి శిరీష ఆధ్వర్యంలో 200 మందికి పైగా పోలీసులు వార్డుల వద్ద బందోబస్తు నిర్వహించనున్నారు. సమస్యాత్మక వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మున్సిపాలిటీలో ఆరు వార్డులను సమస్య సమస్యాత్మక వార్డులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియను బందోబస్తును స్థానిక ఎసిపి లక్ష్మీనారాయణ ఉదయం పరిశీలించారు.

**రేవటి రోజు.. ఎవరో రాజు..**

మున్సిపాలిటీ ఎన్నికల ప్రకటనతో మొదలుకొని మిగతా 2లో




ఆమనగల్లులో..సామాగ్రి పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు


తాండూరులో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్


ఫ్యూచర్ సిటీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు


శంకర్‌పల్లిలో ఎన్నికల సామాగ్రిని సరి చూసుకుంటున్న అధికారులు

# కోరిన వారికి కొంగు బంగారం



**రేపటి నుంచి పోలేపల్లి ఎల్లమ్మ జాతర**

**మూడు రోజులపాటు ఉత్సవాలకు ఏర్పాట్లు**

**తరలిరానున్న లక్షలాది మంది భక్తులు**

**పులకించిపోయే సన్నివేశంతో 13న సిడే సంబురం**

4

మినీ మేడారాన్ని తలపించే ఎల్లమ్మ జాతరకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం పోలేపల్లి ముస్తాబైంది. పశు సంపదను, పంటపొలాలను కాపాడుతూ కోరినవారికి కొంగు బంగారంగా ఈ దేవత కరుణిస్తుందని భక్తుల విశ్వాసం. మహాశివరాత్రికి ముందు వచ్చే శుక్రవారం జరిగే బ్రహ్మోత్సవాలను తిలకించటానికి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి యాత్రికులు వస్తారు. లక్షలాది మంది పాల్గొని పులకించిపోయే సన్నివేశం పోలేపల్లి జాతరలో కనిపిస్తుంది. ఈ ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేశామని ఆలయ అధికారులు చెబుతున్నారు. ఆర్‌టిసి స్పెషల్ సర్వీసులు నడప నున్నాయి.

-ప్రభాతవార్త, దుద్యాల

## వార్డులలో కాసుల వర్షం

**తీవ్ర పోటీ ఉన్న ప్రాంతాల్లో ఓటుకు రూ.5 వేలు**

**రిజర్వుడ్ స్థానాల్లో రూ.3వేలు**

**పోటాపోటీగా ప్రధాన పార్టీ వర్గాల పంపిణీ**

**రంగారెడ్డి జిల్లాలో పరిస్థితి ఇదీ..**



**రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 10, ప్రభావార్త :** జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో సోమవారం రాత్రి నుంచే పలు పార్టీల నేతలు ప్రలోభాలకు తెరలేపారు. బలమైన ప్రత్యర్థుల మధ్య తీవ్ర పోటీ ఉన్న వార్డుల్లో ఒక్కో ఓటుకు రూ.4 వేల వరకు పంపిణీ చేస్తుండగా, రిజర్వుడ్ స్థానాల్లో రూ.2 నుంచి రూ.3 వేల వరకు ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. కొన్ని మున్సిపాలిటీల్లో ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు, కొడంగల్‌లో రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. పలు వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు సైతం ప్రధాన పార్టీలకు దీటుగా పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. పలు వార్డుల్లో మహిళా సంఘాలకు ముందే పంపిణీ చేయాల్సిన చీరలను మహిళా సంఘాల ప్రతినిధులతో ప్రస్తుత ఎన్నికల తరుణంలో పంపిణీ చేయించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో డబ్బులతోపాటు చీరలు, కిరాణ సరుకులు, ఫ్రిడ్జ్‌లు వంటి వస్తువులను కూడా ఓటర్లకు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, ఆయా వార్డుల్లో అన్ని పార్టీల నాయకులు వార్డుల వారీగా మద్యం, మాంసం, నోట్ల పంపిణీకి ద్వితీయ శ్రేణి నాయకులకు బాధ్యతలు అప్పగించి గుట్టుచప్పుడు కాకుండా పూర్తిచేయించారు. చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలు ఆశిస్తు నేతలు తమకు అనుకూలంగా ఉన్న వార్డుల్లో పోటీ చేస్తున్న వారి మద్దతుకోసం వారి ఖర్చులు కూడా భరించడానికి వెనుకాడలేదు. ఆయా వార్డుల్లో పోటాపోటీగా ఖర్చు చేసేందుకు సర్వశక్తులు ఒడ్డారు. దాదాపు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని మున్సిపాల్టీల్లో ఈ ప్రక్రియ కొంతమేరకు బహిరంగంగా నడుస్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. పలు మున్సిపాలిటీల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నా పోలీసులు కంటితుడుపు చర్యగా కొన్ని బాటిళ్లను పట్టుకుని మిగిలినవి వదిలేశారన్న విమర్శలూ వినిపించాయి.

# అభ్యర్థుల్లో టెన్షన్..టెన్షన్..

**ఓటర్లను ఆకట్టుకోవటానికి పోటాపోటీగా ప్రయత్నాలు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీలకు బుధవారం ఎన్నికలు (పోలింగ్) జరుగుతున్నందున పోటీలో ఉన్న అభ్యర్థుల్లో టెన్షన్..టెన్షన్ నెలకొంది. బుధవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగనుంది. మంగళవారం మేడ్చల్ జిల్లాలోని అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాల్టీల ఎన్నికల సందర్భంగా తమను గెలిపించాలంటూ పోటీలో ఉన్న అభ్యర్థులు వ్యక్తిగతంగా ఓటర్ల ఇళ్లకు పోటాపోటీన వెళ్లి వేడుకోవటం, తమనే గెలిపించాలంటూ ఆకట్టుకునే ప్రయత్నాలు కూడ ఇంటింటా వెళ్లి తాయిలాలు చేసినట్లు తెలుస్తుంది. అలియాబాద్‌లో 20వార్డులకు, మూడుచింతలపల్లిలో 24వార్డులకు, ఎల్లంపేట్‌లో 24వార్డులకు ఎన్నికలు జరుగుతు న్నాయి. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీల అభ్యర్థులు దాదాపు అన్ని వార్డులకు పోటీ చేస్తుండగ, మరి కొన్ని పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడ పోటీలో ఉన్నారు. గెలుపు కోసం ఆయా పార్టీల అభ్యర్థులు ఎత్తుకు పైఎత్తు వేస్తూ ప్రచారాలు పోటాపోటీన వారం రోజుల పాటు కొనసాగించటం జరిగింది. ఇక పోలింగ్ బుధవారం జరుగుతుండటంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్న విధంగ ఉంటూ ఓటర్ల నాడి కోసం తంటాలు పడటం జరిగింది. ఓటర్లే మా దేవుళ్లు అంటూ అభ్యర్థులు వారి ఇళ్లకు పలుసార్లు ఆకట్టుకోవటానికి వెళ్లటం కనిపించింది. ఏది ఏమైనా ఎన్నికల వేళ రాకతో అభ్యర్థుల్లో మాత్రం టెన్షన్ టెన్షన్‌లో ఉంటూ ఓటర్లను కలిసే పనిలో పడ్డారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ముగిసినప్పటికీ వ్యక్తిగతంగ అభ్య ర్థులు, అనుచరులు వేరువేరుగా తిరుగుతూ ఓటర్లను ఆకట్టుకునే యత్నాలు చేసినట్లు పరిస్థితిని బట్టి స్పష్టంగా తెలుస్తుంది. ఇక బుధవారం సాయంత్రంతో అభ్యర్థుల భవిషత్ బ్యాలెట్ బాక్సుల్లోకి చేరనుంది. ఇక ఈ నెల 13వ తేదీన ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెలువడిన తరువాత వార్డులకు కౌన్సిలర్స్‌గా గెలిచిన వారు క్యాంపులకు వెళ్లె అవకాశం ఉంటుంది. ఈ నెల 16వ తేదీన చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నికలు జరుగనున్నాయి.


బ్యాలెట్ బాక్సులను పరిశీలించిన ఎన్నికల పరిశీలకురాలు నిర్మలకాంతి వెస్లీ, కలెక్టర్ మనుచౌదరి

## అధికారుల హై అలర్ట్

**ఎన్నికల పరిశీలకురాలు, కలెక్టర్ విస్తృత తనిఖీలు**

**బందోబస్తుతో బ్యాలెట్ బాక్సుల తరలింపు**

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లాలోని అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాల్టీల్లోని ఎన్నికల పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను, కౌంటింగ్ కేంద్రాల స్ట్రాంగ్‌రూమ్‌లను సాధారణ ఎన్నికల పరిశీలకురాలు నిర్మల కాంతి వెస్లీ, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిలు కలిసి సందర్శించి పరిశీలించారు.


పోలింగ్ సామాగ్రి కోసం నిరీక్షిస్తున్న అధికారులు, సిబ్బంది

మంగళవారం మేడ్చల్ జిల్లాలో ఉన్న మూడు మున్సిపాల్టీలకు బుధవారం ఎన్నికలు జరుగుతున్నందున పోలింగ్ సామాగ్రిని తరలించటానికి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను, కౌంటింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లను కూడ వారు సందర్శించి పరిశీలించారు. మూడుచింతలపల్లి మున్సిపాల్టీకి సంబంధించి జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను, ఇక్కడే ఓట్ల లెక్కింపు కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడి నుంచే ఆ మున్సిపాల్టీలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వార్డులకు సంబంధించి పోలింగ్ సామాగ్రి, ఎన్నికల నిర్వాహణ పిఓలు, ఎపిఓలు, సిబ్బంది బ్యాలెట్ బాక్సు లతో వాహనాల్లో పోలీసు బందోబస్తుతో తరలించారు. మూడు చింతలపల్లి మున్సిపాల్టీలో 24వార్డులకు సంబంధించి 48పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి పోలింగ్ నిర్వహించనున్నారు. అదే విధంగా అలియాబాద్ మున్సిపాల్టీలోని 20వార్డులకు మిగతా 2లో

# మహిళా ఓటర్లే టార్గెట్

**ఇబ్రహీంపట్నంలో ఒక్క ఓటుకు10 వేల వరకూ పంపిణీ ?**

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేడు జరగనుండగా పట్టణ ప్రాంతాల్లో నోట్ల రాజకీయం బహిరంగ ప్రదర్శనగా మారిందనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఓటు కోసం నోట్ల వర్షం కురిపించారని, చివరి 36-48 గంటల్లోనే అసలు పోల్ మేనేజ్‌మెంట్ పేరుతో కోట్లు గుమ్మరించారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరందుకుంది. ప్రచారం ముగిసిన వెంటనే రంగంలోకి దిగిన అభ్యర్థుల బృందాలు ఇంటింటికీ చేరి ఓటర్ల సంఖ్య లెక్కగట్టి నగదు పంపిణీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల ఒక్కో ఓటుకు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు ఇచ్చినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. మీకే ఓటు వేస్తాం అంటూ మాటలు తీసుకునే వరకు అభ్యర్థులు వెనక్కి తగ్గలేదని ఓటర్లు చర్చించుకుంటున్నారు. ఒకే ఇంటికి ఇద్దరు, ముగ్గురు అభ్యర్థుల వర్గాలు పోటీగా డబ్బులు ఇచ్చిన పరిస్థితులు కనిపించాయని చెబుతున్నారు. మహిళా ఓటర్లే కీలకమని భావించి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వారికి చీరలు, కిరాణా సామాగ్రి అందించినట్లు సమాచారం. డబ్బుతో పాటు మద్యం, విందులు కూడా ఏర్పాటు చేసి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు జరిగాయని బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి.గత ఎన్నికల్లో పోలింగ్ రోజు బూత్‌ల సమీపంలోనే డబ్బు పంపిణీ జరిగిన ఘటనలను రాజకీయ వర్గాలు గుర్తుచేస్తూ, ఇప్పటికీ పరిస్థితుల్లో పెద్దగా మార్పులేదని వ్యాఖ్యానిస్తున్నాయి. శాంతిభద్రతల పరిమితుల్లోనే పోలీసులు స్పందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.నోట్ల ప్రభావం పెరిగిన కొద్దీ ప్రజాస్వామ్య విలువలు కుంచించుకుపోతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. నేడు పోలింగ్ ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరుగుతుందా అనే సందేహాలు ఓటర్లలో వ్యక్తమవుతున్నాయి.


పోలింగ్ సిబ్బంది విధుల కేటాయింపును పరిశీలిస్తున్న కలెక్టర్

## పోలింగ్ విధుల్లో అప్రమత్తత తప్పనిసరి

**చిన్న పొరపాట్లకూ తావులేకుండా బాధ్యతగా ఉండండి**

**ఎన్నికల పరిశీలకులు మాయాంక్ మిట్టల్, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి అత్యంత అప్రమత్తతతో వ్యవహరించి, చిన్నపాటి పొరపాట్లకు కూడా తావులేకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్, కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ అధికారులకు అందిస్తున్న ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్ మాట్లాడుతూ, పోలింగ్ విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ చెక్‌లిస్ట్ ప్రకారం ఎన్నికల సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి బయలుదేరాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వహించాలని, ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. గడువు లోపు పోలింగ్ కేంద్రంలోకి చేరుకున్న ఓటర్లకు 5 గంటల తర్వాత కూడా ఓటు వేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు. కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన సామగ్రిని కేంద్రాల వారీగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందించాలని, చెక్‌లిస్ట్ ఆధారంగా అందిన సామగ్రిని మరోసారి నిర్ధారించుకోవాలని సూచించారు. సిబ్బందిని తరలించే వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్ణీత పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని, ఎక్కడా రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా పక్కాగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ఓటింగ్ సమయంలో గోప్యతను కాపాడేలా చర్యలు తీసుకోవాలని, ఓటింగ్ మిగతా 2లో


పోలింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

## ఎక్కడా డబుల్ ఓటింగ్ జరగొద్దు

**ఎన్నికల అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

**జనరల్ అబ్జర్వర్ రవి, కలెక్టర్ ప్రతీక్ జైన్**

**కొడంగల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని జనరల్ అబ్జర్వర్ రవి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించారు. బుధవారం జరుగనున్న మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్నికల మెటీరియల్ పంపిణీని పరిశీలించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి, పోలింగ్ అధికారులకు ఇచ్చిన మెటీరియల్‌ని చెక్ చేశారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. 12 వార్డులకు గాను 25 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. బ్యాలెట్ పత్రాలు, బాక్స్‌లు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేసుకోవాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుడి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఎక్కడా కూడా డబుల్ ఓటింగ్ మిగతా 2లో

# ఓటు హక్కు వృథా చేసుకోవద్దు

**పోలింగ్‌కు తరలిరండి : కలెక్టర్ పిలుపు**

**తాండూరు, జనవరి 10, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల నిర్వాహణకు పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం తాండూరులోని సెంట్‌మార్క్స్ స్కూల్‌లో ఎన్నికల సామాగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ వివరాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తాండూరు మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని 36 వార్డులకు గాను 117 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మొత్తం 9జోన్లలో అధికారులను నియమించడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసుకొని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు. బ్యాలెట్ పత్రాలు, బాక్సులు జాగ్రత్తగా చెక్ చేసుకొని సర్దుకోవాలని సూచించారు. ఏమైనా లోపాలు, అనుమానాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, విద్యుత్ సదుపాయం తదితర మౌళిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ మంగీలాల్, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ తారాసింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తాండూరు మున్సిపల్ పరిధిలోని 36వార్డులలో బుధవారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మున్సిపల్ పరిధిలోని 36 వార్డులకు గాను 9రూట్లలో 117 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంగళవారం తాండూరులోని సెంట్‌మార్క్స్ స్కూల్‌లో ఎన్నికల అధికారి, డిఆర్‌ఓ మంగీ లాల్, తాండూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి బ్యాలెట్ బాక్సులతో పాటు ఎన్నికల సామాగ్రిని అందజేశారు. మధ్యాహ్నం నుంచే పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఎన్నికల సామాగ్రితో ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన ప్రత్యేక వాహనాలలో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మంగీలాల్ మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో 9రూట్లలో 9మంది జోనల్ అధికారులతో పాటు 9మంది రూట్ ఆఫీసర్‌లను నియమించడం జరిగిందని తెలిపారు. 117 మంది పిఓలు, 117మంది ఏపిఓ లతో పాటు ఒక్కో పోలింగ్ కేంద్రానికి ముగ్గురు చొప్పున 351మంది ఓపిఓలు, 16మంది మైక్రో పరిశీలకులు, వెబ్‌కాస్టింగ్ సిబ్బందితో పాటు 34పోలింగ్ కేంద్రాల లోకేషన్ సిబ్బంది పాల్గొనున్నట్లు వివరించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. మరోవైపు డిఎస్పీ నర్సింగ్ యాదయ్య ఎన్నికల సామాగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపు ఏర్పాట్లను పరిశీలించారు.

## పోలింగ్ విధుల్లో అప్రమత్తత తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాలని ఆదేశించారు. శేరిగూడలోని మండల్ పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు.

మహేశ్వరం డీసీపీ మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయి భద్రత కల్పించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఫ్యూచర్ సిటీలో ముమ్మర తనిఖీలు**

మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికకు బుధవారం పోలింగ్ నేపథ్యంలో పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్ ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు, పోలీసులు విస్తృత స్థాయిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు.

అక్రమ కార్యకలాపాలు, డబ్బు పంపిణీ, మద్యం తరలింపు వంటి చర్యలకు పాల్పడకుండా చూడాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్‌బాబు ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

## ఎక్కడా డబుల్ ఓటింగ్ జరగొద్దు

(మొదటి పేజీ తరువాయి)

జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్ పార్కింగ్ ప్రదేశాలు, వచ్చిపోయేదారులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రూట్ల వారిగా బస్సులు బయలుదేరే విధంగా అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వరి, మున్సినల్ కమీషనర్ బలరాంనాయక్, తహశీల్దార్ రాంబాబు, సంభందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రంగస్థల విజ్ఞాన సర్వస్వం బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి



**రవీంద్రభారతి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** తెలుగు నాటక రంగ సర్వస్వం, రంగస్థల విజ్ఞనం బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి అని, ఆయన తెలుగునాటకరంగం గర్వించదగ్గ మహానటుడని వంశీ సంస్థల అధినేత కళాబ్రహ్మ శిరోమణి డా. వంశీరామ రాజు అన్నారు. అద్భుత రంగస్థల నటుడుగా ముఖ్యంగా స్త్రీ పాత్రలో మెప్పించి గొప్పగా రాణించి పేరుప్రఖ్యాతులు పొందారని, పోషించిన సక్కుబాయి, చింతామణి, చంద్రమతి మరే పాత్రలైనా ప్రజలు బ్రహ్మరథం పట్టారని చెప్పారు. తన ఆహార్యం, ఆంగికంతో ఏపాత్రనైనా అవలీలగా పోషించే సుబ్రహ్మణ్యశాస్త్రి భారత ప్రభుత్వం తప్పకుండా పద్మశ్రీ అవార్డుతో గౌరవించాలని అధ్యక్షోపన్యాసంలో లంక లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. బుర్రా గొప్పనటుడేకాదు పండితుడని, సంప్ర దాయ కళాకారుడైనా ఆధునిక నాటక విద్యార్థులకు పాఠాలు బోధించే వారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాం స్కృతికశాఖ సౌజన్యంతో బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి కళాపీఠం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగి న బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి 89వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డా. వంశీరామరాజు సభాధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, విశిష్ట అతిథులు చిట్టా వెంకట శివప్రసాద్, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, భాగి శివశంకరశాస్త్రి తదితరులతో కలిసి ప్రఖ్యాత రంగస్థల, ఆకాశవాణి, దూరద ర్శన్ కళాకారిణి కె.ఇందిరను ఘనంగా సత్కరించి బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి రంగస్థల పురస్కారం ప్రదానంచేసి అభినందించారు. సభకుముందు భాగి శివశంకరశాస్త్రిచే భక్తరామదాసు ఏకపాత్రాభినయం; ప్రపుల్లసుందర్‌చే సుబ్రహ్మణ్యశాస్త్రి పద్యాలు, పాటల ఆలాపన సభికులను ఆకట్టుకున్నాయి.

## అపార్ట్‌మెంట్‌లో వ్యక్తి ఆత్మహత్య

**ముషీరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమల గూడ సీఐ అహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం దోమలగూ డలోని బండమైసమ్మ కమ్యూనిటీ హాల్ వెనక ఒక అపార్ట్‌మెం ట్‌లో నేపాల్‌కు చెందిన రమేష్ ధోలి (25) అనే వ్యక్తి భార్య కవిత, ఒక కుమార్తె (2) కలిసి వాచ్‌మెన్‌గా పనిచేస్తూ నివసిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన రమేష్ సోమవారం రాత్రి 11 గంటల సమయంలో తాగి, ఇంటికి వచ్చాడు. పాప ఏడుస్తూ ఉండటంతో పాపను తీసుకుని భార్య కవిత బయ టకు రావటంతో ఫ్యాన్‌కు రమేష్ ఉరివేసుకున్నాడు. అప్పుడే ఇంట్లోకి వచ్చిన కవిత స్థానికుల సాయంతో రమేష్‌ను కిందకు దింపగా, అప్పటికే అతను మృతి చెందాడు. రమేష్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

# ఆఖరి అంకానికి అంతా సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రచారాల దాకా అన్ని ఘట్టాలు ముగిసిపోయాయి.. ఇక ఓటర్లు తమ తమ వార్డుల్లో ఎవరికి తీర్పులు ఇస్తారో.. ఎవరిని రాజును చేస్తారో తేలాల్సి ఉంది.. ఇందుకు రేపటి ఉదయం వేదిక కానుంది..షాద్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో గత కొద్దిరోజులుగా పార్టీలు, అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారుగా ప్రచారాలు చేస్తూ ఆర్భాటం చేశారు. ఇప్పుడు ఓటర్ టైం వచ్చేసింది.. మరి అందరినీ ఓ కంట కనిపెట్టిన ఓటరు ఎవరిని గెలుపు గుర్రం ఎక్కిస్తాడో.. ఎవరిని తొక్కేస్తాడో.. రేపటి ఓటు చెబుతుంది. అయితే బ్యాలెట్ బాక్స్‌లో నిక్షి ప్తమై ఉండే దీనికి సంబంధించిన ఫలితం మాత్రం 13వ తేదీన వెలుగులోకి వస్తుంది. ఇక మున్సిపాలిటీలో గత కొద్ది రోజులుగా ఎన్నికల హడావిడి గురించి చెప్పుకుంటే.. మున్సిపాలి ఖిట్రిక్స్ ఖిషాద్ నగర్ లో మున్సిపాలిటీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి నప్పటి నుంచే సందడి మొదలైంది. బీఫాముల కోసం ప్రతి నుంచి అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి, బీఆర్ఎస్ నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థులు పోటీకి పడ్డారు. అయితే టికెట్ కేటాయింపు తర్వాత అలిగిన వారిని బుజ్జగించడం పార్టీలకు సవాల్ గా మారింది. కానీ దానిని విజయవంతంగా పూర్తి చేసి ఎన్నికల బరిలోకి దిగారు. 147 నామినేషన్లు రాగా, చివరికి పోటీలో ఉపసంహరణ తర్వాత 95 మంది మిగిలారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తో పాటు బిజెపి, బీఎస్పీ, సిపిఎం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, స్వతంత్ర అభ్యర్థులు ఇందులో ఉన్నారు.

**కాంగ్రెస్ జోరు..**

ప్రచారాల విషయంలో గానీ, వ్యూహాల విషయంలో గాని కాంగ్రెస్ ఏ మాత్రం జోరు తగ్గకుండా ముందడుగు వేసింది. ఇందుకు ప్రధాన కారణం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. అభ్యర్థుల ఎంపిక జరిగినప్పటి నుంచి వారికి సరైన దిశా నిర్దేశం చేస్తూ ప్రతి వార్డ్ గురించి తెలుసు కుంటూ ముందుకు సాగారు. ఎక్కడెక్కడ పార్టీ బలహీనంగా ఉంది తెలుసుకొని అక్కడ పరిస్థితిని సరిదిద్ది అభ్యర్థులను పోటీలోకి వచ్చేలా చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితరులతోపాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి విస్తృత ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తీవ్రమైన కృషి చేశారు. మున్సిపాలిటీ ఎన్నికలు తమకు ఎందుకులే అని ఊరుకోకుండా ఒక బలమైన శక్తిగా ఉండి వీరు పార్టీని నడిపించడం కాంగ్రెస్ విజయవకాశాలను భారీగా పెంచింది.

**బిజెపి బల ప్రదర్శన..**

భారతీయ జనతా పార్టీ 19 స్థానాల్లో మాత్రమే తన అభ్యర్థులను నిలబెట్టింది. అయినప్పటికీ బల ప్రదర్శన విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఇతర అగ్ర నాయకుల వచ్చి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కొన్నిచోట్ల బిజెపికి మంచి ఓట్లు పడడంతో పాటు, ఒక వార్డులో కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇస్తూ నిలబడింది. మరోవైపు ఎంఐఎం ఒకే స్థానంలో పోటీ చేస్తున్నప్పటికీ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రచారానికి వచ్చి అభ్యర్థి గౌస్ గెలిపించాలని కోరడం, రోడ్ షోలో పాల్గొనడం విశేషం. ఇక మిగిలిన పార్టీల్లో ఒక్క బీఆర్ఎస్ ను మినహాయిస్తే మిగతా పార్టీ ల పాత్ర నామ మాత్రమే.

**బీఆర్ఎస్ వెనుకబాటు..**

బీఆర్ఎస్ అన్ని వార్డుల్లోనూ అభ్యర్థులను నిలబెట్టినప్పటికీ వారి ప్రచారం అంతా లోలోపలే కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రెండు మూడు వార్డుల్లో తిరిగి ప్రచారం చేయడం మినహాయిస్తే ఎక్కడ కూడా ఈ పార్టీ హంగామా చేయలేదు. మీడి యాకు కూడా పార్టీ నాయకులు, అభ్యర్థులు దూరంగా ఉన్నారు. అభ్యర్థుల వ్యక్తిగత బలంతో వచ్చే స్థానాలు తప్ప పార్టీ ప్రచారంపరంగా, వ్యూహాల పరంగా వచ్చే స్థానాలు ఈ పార్టీకి తక్కువే.

## ఆమనగల్లులో పోలింగ్ ఏర్పాట్లు పూర్తి

**ఆమనగల్లు, జనవరి 10, ప్రభాతవార్త :** ఈనెల 11న జరగనున్న ఆమనగల్లు మున్సిపాలిటి ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా కావలసిన అన్ని ఏర్పాట్లూ చేశారు. జిల్లా ఎన్నికల ఉప అధికారి శంకర్‌నాయక్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 15వార్డులకు గాను 9 పోలింగ్ కేంద్రాలలో 30 బూత్ కేంద్రాలలో ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు 30 మంది పిఒలు, 30 మంది ఎపిఒలతోపాటు ఇతర సిబ్బందిని నియమించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దాదాపు 200 మంది పోలీసులు బందోబస్తును నిర్వహించనున్నారు. వీరిలో సిఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్ళు, మహిళా కానిస్టేబుళ్ళు తదితరులు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, వృద్ధులు, వికలాంగులకు వీల్ చైర్స్‌లు కూడా అందుబాటులో ఉంచినట్లు శంకర్‌నాయక్ తెలిపారు. ఓటర్లు అసౌకర్యానికి గురికాకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల జిల్లా ఉప అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. స్థానిక బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్లో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని అందజేశారు. ప్రత్యేక వాహనాల ద్వారా వీటిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారులు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, డిఈఓ సుశీందర్‌రావు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నికల నిర్వహణపై అవలంబించవలసిన అంశాలను సిబ్బందికి వివరించారు.

మున్సిపాలిటీ పరిధిలోని 15వార్డులకు గాను 54 మంది పోటీ పడుతున్నారు. 16,984 మంది ఓటర్లు ఉన్నారు. అందులో స్త్రీలు 8,509 మంది, పురుషులు 8,475 మంది.

**శంకర్‌పల్లిలో..**

**శంకర్‌పల్లి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** పురపాలక సంఘం శంకర్ పల్లిలో జరిగే మున్సిపల్ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా 15 వార్డులకుగాను 31 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి సామాగ్రిని అందజేశారు.

## శంకరయ్య వర్సెస్ అంజయ్య ఎమ్మెల్యే గారూ.. వ్యక్తిగత దూషణలు వద్దు..

**షాద్‌నగర్ మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి**



మాట్లాతున్న బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు వంకాయల నారాయణరెడ్డి

**షాద్‌నగర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పై వ్యక్తిగత దూషణలు మానుకోవాలని షాద్ నగర్ మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు స్థానిక మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యేని ఉద్దేశించి ఎమ్మెల్యే శంకర్ చేసిన మాటలు అనుచితం అని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని పేర్కొన్నారు. విమర్శలుమాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని నారాయణరెడ్డి హితవుకు పలికారు. బీఆర్ఎస్ అభ్యర్థులను అన్ని వార్డుల్లోనూ భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఆకుల శ్రీశైలం, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, నాయకులు జిల్లెల వెంకట్ రెడ్డి, రాయికల్ వెంకట్ రెడ్డి, బిశ్వ రామకృష్ణ, గోవిందు అశోక్, పాపయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## టిఎన్‌జిఓస్ యూనియన్‌పై అసత్య ప్రచారం సరికాదు

**ఖండించిన..మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు రవిప్రకాశ్**

**..ఉద్యోగుల హక్కుల కోసం అంకిత భావంతో పనిచేస్తున్న సంఘం టిఎన్‌జిఓస్**

..ఫోటోవార్త..10డికె5.మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓస్ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు బి.రవిప్రకాశ్, పాల్గొన్న టిఎన్‌జిఓస్ నాయకులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

ఉద్యోగుల హక్కుల కోసం అంకిత భావంతో పనిచేస్తున్న తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్‌పై (టిఎన్‌జిఓస్‌పై) అసత్య ప్రచారం సరికాదని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు బి.రవిప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓస్ ఆఫీస్‌లో ఆయన మాట్లాడుతూ టిఎన్‌జిఓస్ యూనియన్ ఉద్యోగుల శ్రేయస్సు, సంక్షేమం, హక్కుల సాధన కోసం పోరాడుతున్న యూనియన్ టిఎన్‌జిఓస్ అని, ఓ పత్రికలో ఈ యూనియన్‌పై అసత్య కథనాలు రావటం దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిరాధారమైన ప్రచురణలు రావటం సంఘం ప్రతిష్టను దెబ్బతీయటమే కాకుండ, వేలాది సభ్యులు మనోభావాలను దెబ్బతీసే విధంగ ఉన్నట్లు దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. వాస్తవాలను తెలుపకుండ బాధ్యాతా రహితంగ కథనాలు రాయటం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమంలో టిఎన్‌జిఓస్ కీలకపాత్రను పోషించిందన్నారు. ఉద్యోగుల ఐక్యత, గౌరవం, హక్కుల సాధనమే యూనియన్ ప్రధాన లక్ష్యమని అన్నారు. భవిషత్‌లో సంఘం ప్రతిష్టను దెబ్బతీసే విధంగ అసత్య ప్రచురణలు పునరావృతం అయితే సహించబోమని జిల్లా అధ్యక్షులు బి.రవిప్రకాశ్ స్పష్టం చేశారు.

### ఐదేళ్లలో గచ్చిబౌలిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు : కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

**గచ్చిబౌలి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**

గత ఐదేళ్ల పదవీకాలంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని గచ్చిబౌ లి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి తెలిపారు. కార్పొరేట ర్‌గా ఐదేళ్ల పదవీకాలం ముగిసిన సందర్భంగా మంగళవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి వార్డు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ



సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలో 920కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాయని అన్నారు. ముఖ్యంగా కార్పొరేటర్‌గా పార్టీలకు అతీతంగా పనిచేస్తూ డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగానని తెలిపారు. డివిజన్ పరిధి లోని శ్మశానవాటికలు, పార్కుల అభివృద్ధి, డ్రైనేజీ కాలువల నిర్మాణం, రహదారుల కోసం దాదాపు 328కోట్ల రూపాయల నిధులతో పనులు చేపట్టామన్నారు. కొత్తగా ఏర్పడిన కాలనీ లతో పాటు ఇప్పటి వరకు మంచినీటి వసతి లేని కాలనీలకు 45కోట్ల రూపాయల నిధులతో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి త్రాగునీటిని అందించామని తెలిపారు. విద్యుత్ సరఫరా సక్ర మంగా కొనసాగేందుకు 5కోట్ల రూపాయల నిధులతో పనులు చేపట్టామన్నారు. దీంతో పాటు గచ్చిబౌలి డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో ప్రభుత్వం ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమానికి ప్రాధా న్యతనిస్తూ ముందుకు సాగామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో పాటు డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రేణుక ఎల్లమ్మ దేవాలయ క్యాలెండర్ ఆవిష్కరణ

**చిక్కడపల్లి ఫిబ్రవరి 10 ( ప్రభాతవార్త ) :** అశోక్ నగర్ నగర గ్రంథాలయ సంస్థలో ఆవరణలో రేణుక ఎల్లమ్మ దేవాలయ కమిటీ రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి , సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ ఆవిషరించి ప్రసంగించా రు. ఆధ్యాత్మికతతో పాటు సేవా దృక్పథం చాల అవసరమ న్నారు. దేవాలయ కమిటీలు భక్తి కార్యక్రమాలతో పాటు సా మాజిక చైతన్యానికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ అధ్యక్షులు కె. లక్ష్మయ్య, దేవాలయ కమిటీ అధ్యక్షులు శ్రీ వెంకటేశ్ యాద వ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు దాచేప ల్లి బుచ్చయ్య, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



మాట్లాడుతున్న చెంది తిరుపతిరెడ్డి

## వినాశకాలే విపరీత బుద్ధి

**16వ వార్డులో నీ జేజమ్మ దివచ్చిన విజయం ఆపలేవు**

**ఒగ్గు కిషోర్ కు "చెంది తిరుపతిరెడ్డి" హెచ్చరిక**

**16వ వార్డు ప్రజలు ఎంతో విజ్ఞులు.. ఒగ్గు కిషోర్ కుట్ర పై భగ్గుమన్న చెంది తిరుపతిరెడ్డి**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** నిరుపేద విద్యార్థులకు మంచి విద్యను అందించేందుకు ఎంతో కష్టపడి ప్రజలు సామాజికవేత్తల భాగస్వామ్యంతో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతో కష్టపడి కట్టిస్తున్న ప్రభుత్వ కళాశాల భవన నిర్మాణంలో అక్రమంగా మద్యం నిలువలు చేశారని మీడియాకు తప్పుడు ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందాలనుకున్న బిఆర్ఎస్ నాయకుడు ఒగ్గు కిషోర్‌కు ఎన్నికల్లో తగిన గుణపాఠం ప్రజలే చెబుతారని చెంది తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. కళాశాలలో మద్య విలువలు చేశారని మీడియాకు తప్పుడు సమాచారం అందించిన ఒగ్గు కిషోర్ కుట్ర పై చెంది తిరుపతిరెడ్డి భగ్గుమన్నారు. తమ దేవుడు లాంటి ఎమ్మెల్యే విద్య అభివృద్ధి కోసం చేపట్టిన యజ్ఞం అపవిత్రం చేయడానికి బిఆర్ఎస్ నాయకులు చేసిన అసత్య ప్రచారం బూటకపు ప్రయత్నాలు బెడిసి కొట్టాయని ఇక 16వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ ఓటమి తానే కొని తెచ్చుకుందని అన్నారు. రాజకీయాల్లో ఇంత దుర్మార్గమైన బుద్ధి నీచపు ఆలోచనలు మంచివి కావని తిరుపతిరెడ్డి హెచ్చరించారు. తమకు నిజాయితీగా గెలవాలని ఏలాంటి దుందుడుకు చర్యలు చేపట్టలేదని తమ ఎమ్మెల్యే చేపట్టే అభివృద్ధిపై తమకు గురి ఉందని, ఆయన చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పట్టణంలో మున్సిపాలిటీ పీఠాన్ని దక్కిస్తాయని తమ పరపతిని పరువులు చూసి ఓర్చుకోలేక ఎక్కడ గెలుస్తారో అని అన్యాయంగా నిందలు వేసి కళాశాలపును అప్రతిష్ట పాలు చేసేందుకు కిషోర్ కిట్ర పన్నాడని ఆరోపించారు. దీనికి తగున మూల్యం చెల్లించుకుంటారని ప్రజలు ఎంతో విజ్ఞులని వారికి అన్ని విషయాలు తెలుసని పేర్కొన్నారు. నీచ నికృష్ట సంస్కృతి దౌర్భాగ్యమైన కుట్రలు కుతంత్రాలు తమకు తెలియని ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని తిరుపతిరెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికైనా ఒగ్గు కిషోర్ బుద్ధిగా మసులుకోవాలని లేకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## అధికారుల హై అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి మజీద్‌పూర్‌లో ఉన్న టి చైతన్య హైస్కూల్‌లో ఎన్నికలకు సంబం ధించి 40పోలింగ్ బూత్‌ల కోసం పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కోసం ఏర్పాటు చేసిన సెంటర్‌ను, అదే విధంగా కౌంటింగ్ సెంటర్‌ను కూడ ఏర్పాటు చేయటంతో వారు పోలింగ్ మెటీరియల్ పంపిణీని పరిశీలించారు. ఆ తరువాత కౌంటింగ్ స్ట్రాంగ్‌రూమ్స్‌ను కూడ వారు పరిశీలించారు. ఎల్లంపేట్ మున్సిపాల్టీలోని 24వార్డులకు గాను డబీల్‌పూర్‌లోని బైబిల్ కాలేజీలో 48 పోలింగ్ బూత్‌లకు సంబంధించి పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయగా ఎన్నికల పరిశీలకురాలు, కలెక్టర్ లు సందర్శించి పరిశీలించారు.

ఆ తరువాత కౌంటింగ్ స్ట్రాంగ్‌రూమ్‌లను, ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఆయా మున్సిపాల్టీల కేంద్రాల్లోని పోలింగ్ సామాగ్రి పంపిణీని, పిఓలు, ఎపిఓలు, ఎన్నికల సిబ్బందిని బ్యాలెట్ బాక్సులతో పోలింగ్ కేంద్రాలకు పోలీసు బందోబస్తుతో తరలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ సామాగ్రిని, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో పోలీసు బందోబస్తుతో తరలించటం జరిగిందన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగ, సజావుగా నిర్వహించాలని ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ సూచించారు. పోలింగ్ పూర్తి తరువాత ఆయా కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు ఆయా సెంటర్లలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్లకు తరలించి స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపర్చటం జరుగుతుందన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పోలీసుబందోబస్తు గట్టి భద్రత ఏర్పాటు చేయాలని, ప్రతి కౌంటింగ్ టేబుల్స్ దగ్గర సిసి కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, మున్సిపాల్టీల కమిషనర్లు, పోలీసు ఇన్స్‌పెక్టర్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. బుధవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగనుంది.

ఆ తరువాత బ్యాలెట్ బాక్సులను పోలీసు బందోబస్తుతో ఆయా మున్సిపాల్టీల పరిధిలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు తరలించనున్నారు.

అయితే గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికలను పురస్కరించుకుని గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇక మూడు మున్సిపాల్టీలో ఉన్న 68వార్డులకు సంబంధించి 65,866మంది ఓటర్లు ఉండి ఓటు హక్కును పోలింగ్ కేంద్రాల్లో సద్వినియోగం చేసుకోనున్నారు. దీనికి సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

## ఉద్యోగులకు నేడు సెలవు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో ఓటు హక్కును బుధవారం ఆయా పోలింగ్ కేంద్రాల్లో వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లుగా ఉన్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగిం చుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు.

# అంబర్‌పేటలో రాజకీయాలకతీతంగా అభివృద్ధి

### : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**

అంబర్‌పేట నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం కాచిగూడ డివిజన్ వీరన్నగుట్టలో రూ.34 లక్షలు, బండలబ స్తిలో రూ.18 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను కాచిగూడ కార్పొరేటర్ కన్నె రమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. గోల్నాక డివిజన్ కమలానగర్‌లో రూ.20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. అనంతరం నల్ల కుంట డివిజన్, తిలక్‌నగర్ శివాలయం వద్ద రూ.25 లక్షలతో సీసీ రోడ్డు, తిలక్‌నగర్‌బస్తి గాంధీ బొమ్మ వద్ద రూ.9 లక్షలతో డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ వై.అమృత తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించా రు. ఈ ప్రారంభోత్సవాల సందర్భంగా అభివృద్ధి పనులు చేప ట్టిన బస్తీల్లో ఎమ్మెల్యే కాలేరు పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన వారం రోజులుగా రూ.15 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధిని పనుల పట్ల సంబంధిత అధికారులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని, సదరు కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆదే శించారు. అభివృద్ధి పనుల పట్ల అధికారులు



కాచిగూడలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

పర్యవేక్షణ అవస రమని, అధికారుల నిరక్ష్యం తగదన్నారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సకాలంలో నిర్మాణ పనులను పూర్తిచే సి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రోడ్డు తవ్వి వదిలేయకుండా సకాలంలో సిసి రోడ్డు పనులు చేపట్టి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించా రు. స్థానికంగా వీధిదీపాల సమస్య, పాడైపోయిన విద్యుత్ స్తం భాలను, డ్రైనేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమస్య లను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బిజెపి నాయకులు, స్థాని క బస్తీ వాసులు, జలమడలి అధికారులు జిహెచ్ఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# పప్పులో కాలేసిన ఒగ్గు కిషోర్..

**కళాశాలలో మద్యం డంప్ ఉందని అసత్య సమాచారం**

**కళాశాలకు వెళ్లిన మీడియా బృందం స్టోర్ రూములు, ఇతర గదులు తనిఖీ చేయగా దొరకని మద్యం**

**ఒగ్గు కిషోర్ ఇంత దిగజారతాడని అనుకోలేదు కాంగ్రెస్ యువ నాయకుడు, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ ఆగ్రహం**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేపట్టిన నూతన కళాశాల భవన నిర్మాణంలో 16వ వార్డు నాయకులు కొందరు మద్యం నిల్వలు దాచారని మీడియాకు బిఆర్ఎస్ స్థానిక నాయకుడు ఒగ్గు కిషోర్ సమాచారం ఇవ్వడంతో కళాశాలలో మీడియా బృందం పర్యటించింది. అయితే అక్కడ స్టోర్ రూమ్ లో అదేవిధంగా ఇతర గదులు అన్ని తనిఖీ చేయగా ఎలాంటి మద్యం విలువలు లేవని మీడియా బృందం గ్రహించింది. ఇక్కడ నిలువలు లేవని మీడియాకు ఫిర్యాదు చేసిన ఒగ్గు కిషోర్ కు స్పష్టం చేసింది మీడియా. అదేవిధంగా కళాశాలలో మద్యం విలువలు ఉన్నాయని ఒగ్గు కిషోర్ తప్పుడు సమాచారం మీడియాకు చేరవేయడం అక్కడ మద్యం నిలువలు మీడియాకు లభించకపోవడంపట్ల కళాశాల నిర్మాణంలో పనిచేసే సిబ్బంది పర్యవేక్షకులు తప్పుడు సమాచారం పై దుమ్మెత్తి పోశారు. వెధవ రాజకీయాలు.. చెత్త పనులు మానుకోండి కాంగ్రెస్ నేత అశోక్ హితవు16వ వార్డు బిఆర్ఎస్ నాయకుడు ఒగ్గు కిషోర్ చెత్త రాజకీయాలు, వెధవ రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకుడు కళాశాల నిర్వహణ పర్యవేక్షకుడు ఎర్రోళ్ల అశోక్ హితవు పలికారు.

గత పదేళ్ల టిఆర్ఎస్ నాయకులు చేసిన విధ్వంసాలు ఇతర అక్రమాలు ప్రజలకు అందరికీ తెలుసని మా ఎమ్మెల్యే శంకర్ మాకు మంచితనం నేర్పించారని ఇలాంటి చిల్లర పనులు వెధవచేతలు నేర్పించలేదని మీకు చేసే బుద్ధులు ఉన్నాయి కాబట్టి ఇతరులపై అభండాలు వేయడం మీకు అలవాటు అయిందని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న కళాశాల భవనానికి ఇంకా తలుపులు బిగించలేదు అదే విధంగా స్టోర్ రూములు కూడా తాళాలు తీసి మీడియా ప్రతినిధుల సాక్షి గా చూపించాము. కానీ ఎక్కడ మద్యం నిల్వలు దొరకలేదు. కాంగ్రెస్ పార్టీని అప్రతిష్టపాలు చేయడానికి ఒగ్గు కిషోర్ చేసిన ఆరోపణలు సమంజసం కాదని అశోక్ తెలిపారు. ఇలాంటి తప్పుడు ఫిర్యాదులు చేసే ముందు ఆలోచించుకోవాలని ఇలాంటి వాటిపై తాను చట్ట ప్రకారం ముందుకు వెళ్తానని అశోక్ తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ అభివృద్ధిని రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక కళాశాలను అప్రతిష్టపాలు చేయడానికి వోగ్గు కిషోర్ కుట్ర చేశారని దీనిని వార్డు ప్రజలు గమనిస్తారని తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఓటమి ఖాయం అయ్యాక గెలవలేక కిషోర్ ఇలాంటి కుట్రలు కుతంత్రాలు చేసి అక్రమ పద్ధతిలో గెలవాలని చూశాడని తానే పప్పులో కాలేసి ఓటమి కొని తెచ్చుకున్నాడని అశోక్ అన్నారు.



కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కలిపిస్తున్న వ్యక్తిత్వ ఉపాసన

# ఆత్మవిశ్వాసమే అర్ధ విజయం

## నమ్మకం, సాధనలతో విజయం సాధించవచ్చు

**యాచారం ఫిబ్రవరి10,ప్రభాతవార్త :** మీరు ఇప్పటివరకు చేసిన కష్టం వృథా కాదు అని, చదివిన ప్రతి పాఠం, రాసిన ప్రతి నోట్స్, చేసిన ప్రతి సాధన ఇవన్నీ ఈ రోజు మీ బలంగా మారతాయి అని కుర్మిద్ద గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీరాములు అన్నారు. కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. పరీక్షలసమయంలో భయపడటం కాదు, మీపై మీరు నమ్మకం పెట్టుకోవడం ముఖ్యం అని అన్నారు . తప్పులు వస్తే భయపడకుండా, ప్రశ్న అర్థంకాకపోతే శాంతంగా చదివి జవాబు రాయాలని తెలిపారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు రహెమత్ అలీ మాట్లాడుతూ ఒక ప్రశ్న మీ భవిష్యత్తును నిర్ణయించదని, ఇతరులతో పోల్చుకోవడం మానేసి మీ శక్తిని గుర్తించండని అన్నారు. మీరు చేయగలరు అనే నమ్మకం మీలో ఉండాలని, ఎందుకంటే ఆత్మవిశ్వాసమే అర్ధ విజయం అని తెలిపారు. ఈ పరీక్షలు ముగిసిన తర్వాత మీరు గర్వపడేలా ఈ రోజు ప్రయత్నించండని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తు పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు స్వప్న, రాణి, శ్రీనివాస్, అశోక్, వీరమణి తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ వేధింపులు భరించలేక
# విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ..

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన ..**

**విద్యార్థిని చదవలేక ఆత్మహత్యకు ప్రయత్నించిందని తెలిపిన ఆర్ సి ఓ రాజేష్**

**షాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** షాబాద్ టీచర్ వేధింపులు భరించలేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలలోకి వెళితే షాబాద్ మండల పరిధిలోని ఆస్పల్లిగూడా గేటు దగ్గర పాత కైట్ కాలేజ్ భవనంలో ఎంజెపిటిబిసిడబ్ల్యూఆర్ పాఠశాల మొగిలిగిద్ద, కేరెల్లి హాస్టల్స్ ను నిర్వహిస్తున్నారు. మొగిలిగిద్ద పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఫిజిక్స్ టీచర్ వేధిస్తుందని ఈనెల 5వ తారీఖున దవ్ షాంపూ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.ఐదు రోజుల తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గత కొన్ని రోజులుగా ఫిజిక్స్ టీచర్ నన్ను వేధించడం వల్లే ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించానని బాధిత విద్యార్థిని తెలిపింది. గత మూడు నెలలుగా తన కూతురును టీచర్ వేధిస్తున్నారని,ఇక్కడ విద్యార్థులకు తిండి సరిగా పెట్టకపోవడం వల్లే అనారోగ్య పాలవుతున్నారని విద్యార్థిని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు.చదవడం చేతకాకే ఆత్మహత్య ప్రయత్నం... ఆర్ సి ఓ రాజేష్ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన విద్యార్థిని చదవడం చేతకాకే అలా చేసిందని, ప్రతి విద్యార్థి మంచిగా చదవాలనే ఉద్దేశంతోనే టీచర్లు వారిని మందలిస్తారని ఆర్ సి ఓ రాజేష్ తెలిపారు. ఏ టీచర్ అయినా సరే విద్యార్థులను కావాలనే కొట్టరని, వారు బాగుపడాలనే, చదువులో పైకి ఎదగాలనే ఉద్దేశంతోనే విద్యార్థులను మందలిస్తారని తెలిపారు. ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన విద్యార్థినికి ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిసిందని అన్నారు.




శ్రీ ఇందు కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం అధికారులకు ఎన్నికల నిర్వహణపై సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ సాధారణ ఎన్నికల పరిశీలకులు మయాంక్ మిట్టల్

# పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, సాధారణ ఎన్నికల పరిశీలకులు మయాంక్ మిట్టల్**

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10 (ప్రభాతవార్త):** బుధవారం జరిగే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో విధులు నిర్వహించే అధికారులు ఎలాంటి పొరపాట్లు లేకుండా బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, సాధారణ ఎన్నికల పరిశీలకులు మయాంక్ మిట్టల్ సూచించారు. మంగళవారం శ్రీ ఇందూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని వారు పరిశీలించి పోలింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.చెక్‌లిస్ట్ ప్రకారం ఎన్నికల సామాగ్రిని సరిచూసుకుని పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని, ఎన్నికల సంఘం నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. గడువులోపు కేంద్రానికి వచ్చిన ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించాలని చెప్పారు.పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చూడాలని, ఓటింగ్ గోప్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూంకు తరలించాలని తెలిపారు. అనంతరం శేరిగూడలోనీ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను కూడా పరిశీలించారు.

# అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

**కేశంపేట, జనవరి 10, ప్రభాతవార్త:** అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సి ఐ నరహరి తెలిపారు. సిఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం విధి నిర్వహణలో భాగంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి ఆదివారం తెల్లవారుజామున దాదాపు 3:30 గంటల సమయంలో కేశంపేట మండల పరిధిలోని భైర్ఖాన్ పల్లి గ్రామ శివారులో ఉన్న తట్టేకుంట తాండ నుండి భైర్ఖాన్ పల్లి వైపు మట్టిలోడుతో వస్తున్న రెండు టిప్పర్లు టీఎస్ 07 యు పి 2333, ఏపీ 27 టి యు 9888 నెంబర్ గల వాహనాలు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న అశోక లేలాండ్ టిప్పర్లను పట్టుకొని కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించి సంబతిత వాహనాలు కల్వకోలు గ్రామానికి చెందిన కొండని లక్ష్మణ్ ఆదేశాల మేరకు అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తవ్వి విక్రయిస్తున్న టిప్పర్ డ్రైవర్లు కొండాని ప్రేమ్ రాజ్, మరియు మనోజ్ యాదవ్ లుగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు సిఐ నరహరి తెలిపారు . ఎక్కడైనా ఎవరైనా అనుమతులు లేకుండా మట్టిని కానీ ఇసుకను కానీ తరలిస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సీఐ నరహరి తెలిపారు.

## తప్పుడు పత్రాలతో ఇంటిని ఆక్రమించేందుకు యత్నించిన వ్యక్తి అరెస్ట్

**బేగంపేట ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**

తనకు ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చి ఇంట్లో అద్దెకు దిగిన తర్వాత తప్పుడు పత్రాలు సృష్టించి ఇంటిని ఆక్రమించుకునేం దుకు యత్నించిన వ్యక్తిని బేగంపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసారు.ఎస్సై శ్రీధర్ తెలిపిన కథనం మేరకు వివరాలి లా ఉన్నాయి.బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని సాయి క్రీసెంట్ టవర్స్‌లో షర్మిల బోత్రా అనే మహిళకు 301నెం బరు కల్గిన ఫ్లాటు ఉంది.ఈ ఫ్లాటు లోకి 2018లో కిరాయికి అభిరాముల మోక్ష కళ్యాణ్ రామ్ అనే వ్యక్తి వచ్చాడు.కరోనా సమయంలో కొద్ది నెలలు అద్దె ఇవ్వకుండా ఎగ్గొట్టాడన్నారు.ఆ తరువాత ఫ్లాట్ యజమాని పేరుతో తప్పుడు అమ్మకపు ఒప్పంద పత్రాలను సృష్టించాడన్నారు.ఈ పత్రాల సాయంతో కోర్టులో కేసు వేసాడు.ఫ్లాట్ యజమాని తన వద్ద డబ్బు తీసు కుందని,ఆమె రాసిచ్చిన పత్రాల ప్రకారం ఇంటిని తన పేరుతో రిజిస్టర్ చేయించేలా ఉత్తర్వులివ్వాలని న్యాయస్థానాన్ని కోరాడు.ఈ పరిణామంతో నివ్వెర పోయిన యజమాని షర్మిల బోత్రా బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించింది.కేసు నమోదు చేసుకు న్న పోలీసులు దర్యాప్తు చేసి విచారణ చేయగా విచారణలో విస్తు పోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి.అభిరాముల మోక్ష కళ్యాణ్ రామ్ తప్పుడు పత్రాలు సృష్టించినట్లు గుర్తించారు.ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలియజేసారు.

## రౌడీషీటర్లకు జగద్గిరిగుట్ట పోలీసుల హెచ్చరిక..

**జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో మంగళ వారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి ప్రస్తుత కార్యకలాపాలను ఆరా తీశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, నేరాలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ వెంకటేశం హెచ్చరించారు. సత్ప్రవర్తనతో సమాజం లో మెలగాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు.

# యువత క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

**..మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి**

**..బిఆర్ఎస్ యువనేత ఆధ్వర్యంలో**

**నారపల్లి క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీలు**



పోచారం డివిజన్ పరిధిలో నారపల్లి క్రికెట్ ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి క్రీడా పోటీల నిర్వహకుడు అబ్బవతి నర్సింహ తదితరులు.

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 10, ప్రభాత వార్త:** యువత క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం డివిజన్ పరిధిలో నారపల్లి క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీలు మంగళ వారం ఘనంగా ప్రారంభమయ్యాయి. డివిజన్ బీఆర్ఎస్ యువ నాయకుడు అబ్బవతి నర్సింహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ పాల్గొని టాస్ ఏగురవేసి టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ మాట్లాడుతూ యువత క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని అన్నారు. క్రీడా పోటీల్లో గేలుపోటములను పాజిటివ్‌గా తీసుకోవాలని అన్నారు. క్రీడల్లో రాణించేందుకు నిరంతరం సాధన చేయాలని క్రీడల ద్వారా మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే క్రీడా పోటీల్లో 24 క్రికెట్ టీంలు పాల్గొంటున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఒరుగంటి వెంకటేశ్ గౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, చింతల రాజశేఖర్, ఎస్. రవీందర్ గౌడ్, మెట్టు బాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బొడ్డు నాగార్జున, నాయకులు సామల బుచ్చిరెడ్డి, నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, కేఎం. రెడ్డి, జితేందర్ నాయక్, బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డి, అబ్బవతి స్వామి, అంజన్‌కుమార్ గౌడ్, కొమ్ముల ప్రశాంత్, సంతోశ్, యూత్ కాంగ్రెస్ నాయకులు బి. మల్లిఖార్జున్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి, ఆర్గనైజర్లు బాస్కర్, ఈశ్వర్, అనిల్ గౌడ్, నాగరాజు, మస్తాన్, సాయికిషోర్, జీవ,బాగి క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా చెట్లు నరికివేత

## పట్టించుకోని అధికారులు

**తలకొండపల్లి ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో



చంద్రన్న టు వెల్జాల్ రోడ్ లో చెట్లు నరికి వేసిన దృశ్యం

ప్రతిష్టాత్మకంగా పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ గత కొన్ని సంవత్సరాలుగా చెట్లను విరివిగా పెంచేందుకు బడ్జెట్లో నిధులు కేటాయించి చెట్లు పెంచాలని అధికారులకు నాయకులు పురమాయిస్తున్నా ,అవి ఏమాత్రం పట్టకుండా కొంతమంది తన ఇష్టం వచ్చిన రీతిగా ఉన్న చెట్లను నరికి వేస్తున్నా, ఏ ఒక్క అధికారి పట్టించుకోవడంలేదని, పలువురు మండల ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని తలకొండపల్లి టు వెల్జాల్ వెళ్లే రోడ్డులో గత కొన్ని సంవత్సరాలుగా ఏపుగా పెరిగిన చెట్లు ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణాన్ని కాపాడాలని నెపంతో ప్రతి గ్రామంలో ఒక నర్సరీని ఏ ర్పాటు చేసి ఆ నర్సరీ మొక్కలకు ప్రభుత్వ, దేవాలయ, అసైన్మెంట్, రోడ్డు ఇరువైపులా ఉండే స్థలాలలో మొక్కలను పెంచేందుకు కృషి చేస్తుంది. చిన్న మొక్కలను పెంచి ఉపాధి హామీ కూలీల ద్వారా, ఆ మొక్కలను రోడ్డులకు ఇరు వైపులా, ఇతర ప్రభుత్వ భూముల స్థలాలలో మొక్కలు నాటి వాటిని కాపాడేందుకు తీవ్రప్రయత్నం చేస్తుంది. మరోవైపు ఉన్నచెట్లను అభివృద్ధిపేరుతో రోడ్డులకు ఇరు వైపులా ఉన్న పెద్ద పెద్ద చెట్లను కొంతమంది ఇష్టారీతిన నరికివేస్తున్న అటవీశాఖ అధికారులు కానీ ఇతర అధికా రులు ఏమాత్రం వారిపై చర్య లు తీసుకోవడం లేదని పలు వురు మండల ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. చంద్రధన నుంచి వెల్జాల్ వెళ్లే రోడ్డులో ఉన్న రోడ్డుకు ఇరువైపులా గల చెట్లను విద్యుత్ స్తంభాల పేరుతో ఇష్ట రీతిలో నరికి వేసిన ఏమాత్రం స్పందించడం లేదని, ఏదో ఒక గ్రామంలో రైతు తమపొలంలో భూమిచదును కోసం చేసే చెట్లను నరికివేస్తే స్పందించే అధికారులు ప్రస్తుతం రోడ్డుపై ఉన్న చెట్లను నరికిన ఏమాత్రం స్పందించక పోవ డంతో అధికారులు సైతం వారికే వత్తాసు పలుకుతున్నట్లు పలువురు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి చెట్లను నరికి వేసిన వారిపై చర్యలు తీసుకొని మళ్ళీ చెట్లు నాటించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు మండల ప్రజలు కోరుచున్నారు.



వెల్జాల్- చంద్రధన రోడ్డుపై నరికిన చెట్లు



చెట్ల కొమ్మలు నరకడంతో మొండిగా మిగిలిన చెట్లు



గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు

# దేవర్‌ఫస్లావాద్ గ్రామానికి జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు

**దౌల్తాబాద్,ఫిబ్రవరి 10,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలోని దేవర్‌ఫస్లావాద్ గ్రామానికి జాతీయ స్థాయిలో అవార్డు పొందేందుకు అవకాశం అభించింది.ఈ మేరకు రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ,జిల్లా పంచాయతీరాజ్ అధికారి జయసుధ సోమవారం గ్రామంలో పర్యటించారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ...తెలంగాణలోని 9 పంచాయితీల్లో దేవర ఫస్లావాద్‌ను జాతీయ స్థాయిలో అవార్డు పొందేందుకు అవకాశం దక్కిందన్నారు.గ్రామస్థులు సమష్టి కృషితోనే ఈ అవకాశం అభించిందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూర రాజు,ఎంపీడీఓ శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకింగ్ మోసాలపై ఆర్‌బిఐ అవగాహన కార్యక్రమం

**-ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**-తెలంగాణ రీజనల్ మేనెజర్ శీల**



పోస్టర్‌ను విడుదల చేస్తున్న రీజినల్ మేనెజర్ శీల

**దౌల్తాబాద్,ఫిబ్రవరి 10,ప్రభాతవార్త:** డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు,బ్యాంకింగ్ మోసాలు అధికమవుతున్నాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బిఐ) అధికారులు హెచ్చరించారు.ఈ నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంచెందుకు ఆర్‌బిఐ ప్రత్యేకంగా రూపొందించిన సైబర్ భద్రతా అవగాహన పోస్టర్‌ను మంగళవారంరోజు విడుదల చేశారు.బ్యాంక్ అధికారులు,పోలీసు విభాగం సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ అవగాహన కార్యక్రమంలో ఒటిపి,ఎటీఎమ్ పిన్,సీవివి నంబర్ వంటి గోప్యమైన వివరాలను ఎవరికి చెప్పకూడదని సూచించారు.బ్యాంక్ పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు,లింక్‌లకు స్పందించవద్దని ప్రజలకు ఈ సంధర్భంగా వారు సూచించారు.ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష

## ఎల్లమ్మ జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్ ప్రతీక్ జైన్



పోలేపల్లి ఎల్లమ్మ తల్లిని దర్శించుకుంటున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ స్నేహా మెహ్రా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**దుద్యాల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోలేపల్లి ఎల్లమ్మ జాతర ఏర్పాట్లపై కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ స్నేహ మెహ్రా, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈనెల 12వ తేదీ నుండి ప్రారంభం అయ్యే పోలేపల్లి ఎల్లమ్మ దేవస్థానం జాతరకు వచ్చే భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.

ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గురువారం నుండి పోలెపల్లి ఎల్లమ్మ జాతర ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలన్నారు. వారం రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నందున జాతరకు వచ్చే సుమారు లక్షకు పైగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపడుతూ పర్యవేక్షణ చేపట్టాలన్నారు. జాతర నిర్వహణపై రోజువారీగా సమీక్షించుకుంటూ ముందుకు పోవాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా జరగాలని, అవసరమైతే జనరేటర్ ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ అధికారులకు సూచించారు. అంబులె న్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అత్యవసరమయ్యే మందులు అందుబాటులో ఉంచుకోవాలని, డాక్టర్లు, వైద్య సిబ్బంది భక్తులకు నిరంతరం సేవలందిస్తూ 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. శానిటేషన్ విస్తృతంగా చేపట్టి బ్లీచింగ్ చేయించాలని, త్రాగునీరు క్లోరినేషన్ చేయించాలని, దోమల నియంత్రణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. భక్తుల కొరకు ఆర్టీసీ అధికారులు అదనంగా బస్సుల ు వేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలనీ, ఇంజనీరింగ్ శాఖ అధికారులు ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. దైవ దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా బారి కేడింగ్ చేపట్టాలన్నారు. హకీంపేట్ ప్రధాన కూడలిలోని ఆర్చి నుండి దేవాలయం వరకు రోడ్డు లేవలింగ్ ప నులు చేపట్టాలని, జాతరకు సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు త్రాగునీరు, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయుటకు ప్రణాళిక లు సిద్ధం చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలనీ, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, వైద్య ఆరోగ్య, విద్యుత్, షిఫ్ట్ ల వారీగా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. జాతర నిర్వహిస్తున్న వారం రోజులు ఆలయం విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా కనిపించాలని, ఆలయ ప్రాంగణమంతా లైట్లు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయముతో ముందు కెళ్లాలని, క్యూ లైన్ దగ్గర మహిళా పోలీస్ సిబ్బందిని, పార్కింగ్ ప్లేస్ లో పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

అనంతరం ఎలమ్మ అమ్మ వారి దర్శనం చేసుకున్నారు. ఈ సమావేశంలో కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, దేవాలయం ఈవో రాజేందర్ రెడ్డి, చైర్మన్ ముచ్చటి వెంకటేష్, డిపివో జయసుధ, ఆరోగ్య శాఖాధికారి స్వర్ణ కుమారి, రవీంద్ర యాదవ్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ, సంబంధిత అధికారులు, తహసిల్దార్ కిషన్, ఎంపీవో సత్యనారాయణ, పీహెచ్సీ డాక్టర్ వందన, పోలేపల్లి గ్రామ సర్పంచ్ జింకలి చంద్రయ్య, నాయకులు అవుటి శేఖర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు..అన్నదానం



శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారు ఆలయంలో పూజలు అందుకున్న దృశ్యం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శామీర్‌పేట మాజీ ఎంపిపి దాసరి ఎల్లుబాయి–బాబు దంపతులు శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ఆ తరువాత వారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అదే విధంగ వారితో పాటు స్వర్గీయ బత్తిని ఈశ్వర్‌గౌడ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, డిజి వెంకటేశ్‌గౌడ్ వారి కుటుంబ సభ్యులు, బాబగూడకు చెందిన మస్కూరి కృష్ణ వారి కుటుంబ సభ్యులు వారందరూ కూడ అన్నదాన కార్యక్రమానికి సహకరించారు. శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయంకు విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆ తరువాత అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీని లో మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు,రాజీవ్‌రహదారిన వెళుతున్న భక్తులు పలువురు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని చేసిన శామీర్‌పేట మాజీ ఎంపిపి దాసరి ఎల్లుబాయి-బాబు దంపతుల దృశ్యం



## ఇన్నోక్వెస్ట్ హ్యాకథాన్ 2026 పోస్టర్ ఆవిష్కరణ

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 10, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ వెంకటాపూర్ ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం డీన్ విజయ్ కుమార్ చేతుల మీదుగా ఇన్నోక్వెస్ట్ హ్యాకథాన్ 2026 పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ వి. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 27 నుండి మార్చి 1వ తేది వరకు నిర్వహించే హ్యాకథాన్ ద్వారా విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభను ప్రదర్శించుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని డీన్ సూచించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ డీన్ జి. విష్ణుమూర్తి, స్టూడెంట్స్ అఫైర్స్ ఎం. శ్రీనివాస రావు, కన్వీనర్ పి. రవీందర్ రావు, దుర్గ భవానీ, దీపిక తదితరులు పాల్గొన్నారు.

## 12న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**షాద్‌నగర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** ఈనెల 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ రాజు అన్నారు మంగళవారంనాడు స్థానిక దేవి గ్రాండ్ హోటల్లో కార్మిక సంఘాలు ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన జరుగు దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులతో పాటు విద్యార్థులు, యువజనలు, మహిళలు, మేధావులు, సామాజిక తరగతులు భాగస్వాములు కావాలని కోరారు. మన దేశ స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అందులో భాగంగానే 500 బిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందని ప్రకటించారని అన్నారు. రష్యా నుండి చమురు కొనుగోలు ఆపి అమెరికా చెప్పిన విధంగా కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తే కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం అన్యాయమని అన్నారు. ఒకవైపు ఆత్మనిర్భర భారత్ గురించి చెబుతూనే మరోవైపు భారత దేశంలోకి వచ్చే వస్తువులపై సుంకాలను పూర్తిగా తొలగించడం ఈ దేశ కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజల జీవితాలను విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమేనని అన్నారు. ఈ ఒప్పందం అమలు అయితే అమెరికా నుండి మొక్కజొన్న, పత్తి, సోయాబీన్ తదితర పంటలు, పాలు, పాల పదార్థాలు ఎలాంటి దిగుమతి సుంకాలు లేకుండా పెద్ద ఎత్తున మన దేశంలోకి దిగుమతి అవుతాయి. అమెరికాలో వ్యవసాయ రంగానికి అక్కడి ప్రభుత్వం 50శాతం సబ్సిడీ ఇస్తుంది. మన మనదేశంలో మన వ్యవసాయ రంగానికి భారత ప్రభుత్వం 3శాతం మాత్రమే సబ్సిడీ ఇస్తుంది. మన దేశ వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులతో పోల్చితే అమెరికా వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు చాలా చౌక. చౌకగా ఉత్పత్తి అయిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు ఈ ఒప్పందంతో మనదేశంలోకి విచ్చలవిడిగా వస్తాయి. మన రైతాంగం పండించిన పంటలు అమ్ముకునే దారి లేక దివాళా తీస్తారు. 65శాతం జనాభా ఆధారపడి ఉన్న మన వ్యవసాయ రంగం దివాళా తీస్తుంది. మన దేశం నుండి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువుల పైన 18 శాతం పన్నులు అమెరికా విధిస్తుంది. మనదేశంలోకి దిగుమతులు ఇబ్బడి ముబ్బడిగా వస్తాయి. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు ఎరువుల మీద సబ్సిడీలు తగ్గించి ఎరువులు ధరలు పెంచుతున్నది. 2026-27 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఎరువులపై సబ్సిడీ తగ్గించింది. విత్తనచట్టం, విద్యుత్‌చట్టాలలో మార్పులు చేస్తున్నది. విత్తనంపై రైతు హక్కు కోల్పోతాడు. విద్యుత్ చట్టం 2025 ద్వారా స్మార్ట్ మీటర్లు అమల్లోకి వస్తాయి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఉండదు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005ను రద్దుచేసి, పేదలకు ఉపాధి లేకుండా చేసే 2025 విబి జీ రామ్ జి చట్టాన్ని తీసుకువచ్చింది. కేంద్రం 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించింది. ఈ విధానాలకు నిరసనగా గ్రామ గ్రామాన నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మలు దహనం చేయాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ కార్మిక వర్గం నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను గ్రామ, గ్రామాన నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ శివ ఎన్పిఆర్డి సంఘం జిల్లా అధ్యక్షులు భుజంగారెడ్డి రాజు నాయక్ ఆవాజ్ సంఘం నాయకులు మహమ్మద్ బాబు మహిళా సంఘం నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజునాయక్

## పసిపిల్లలకు ఆటపాటలతో విద్యను బోధిస్తే మంచి పరిజ్ఞానం

**సర్పంచ్ దరక్షన్ తమన్నా అజీంపటేల్**

**పూడూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** పసిపిల్లలకు ఆటపాటలతో విద్యను బోధిస్తే మంచి పరిజ్ఞానం వచ్చే అవకాశం ఉందని సర్పంచ్ దరక్షన్ తమన్నా అజీంపటేల్ పేర్కొన్నారు. ఎస్‌బిఐ పాన్ ఇండియా సిఎస్ఆర్ యాక్టివిటీ హైదరాబాద్, మిత్రహోలిస్టిక్ హెల్త్ సొసైటీల సంయుక్త సహకారంతో మంగళవారం పూడూరు మండలం పరిధిలోని మన్నె గూడ అంగన్‌వాడీ కేంద్రానికి విడుదలైన ఆటవస్తువులతోపాటు పలు రకాల సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ విద్యార్థుల ఆరోగ్య భద్రతకోసం ప్రభుత్వాలు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పాన్ ఇండియా సిఎస్ఆర్ యాక్టివిటీ హైదరాబాద్ పరిగి బ్రాంచి చీఫ్ మేనేజర్ రోహిణి, మిత్రహోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాణిక్యం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




పూడూరు మండలం మన్నెగూడ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు ఆటవస్తువులు అందజేస్తున్న నాయకులు,అధికారులు,తదితరులు

## అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషిచేస్తా

: సర్పంచ్ దయాకర్



పూడూరు మండలం ఎన్కెపల్లి గ్రామంలో అంతర్గత ఫార్మేషన్‌రోడ్ల నిర్మానపు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ దయాకర్ తదితరులు

**పూడూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషిచేస్తానని సర్పంచ్ టి.దయాకర్ పేర్కొన్నారు. మంగళవారం పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలోని వివిధ కాలనీల్లో గ్రామపంచాయతీ నిధులతో అంతర్గత ఫార్మేషన్‌రోడ్లను చదునుచేసి నూతనంగా నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో మంచినీటి కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోనున్నట్లు వివరించారు. మరుగునీటి కాలువల పరిశుభ్రతతోపాటు పాడైన అంతర్గత సిసి రోడ్ల మరమ్మతులపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విజయ్, పంచాయతీ సభ్యులు రమేష్, నరేష్, నర్సింలు, తనూజ, గ్రామస్తులు అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## అందరూ ఆహ్వానితులే..!

**చేగూరు ఉమ్మడి గ్రామ వెంకమ్మగూడలో..**
**శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు షురూ**

**నందిగామ, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని నందిగామ మండలంలోని చేగూరు ఉమ్మడి గ్రామ వెంకమ్మగూడలో వెలసిన చారిత్రాత్మక పురాతన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 15 వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ధరూర్ సతీష్ పటేల్, ఆలయ పూజారి వీరేశం స్వామి సోమవారం తెలిపారు. ఈనెల 15వ తేదీన బహుళ త్రయోదశి నుండి ప్రారంభమై 19 వ తేదీ సాయంత్రం ముగింపు వరకు జరిగే వేడుకలకు భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. 18వ తేదీ బుధవారం జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పలువురు రాజకీయ ప్రముఖులు, ఆలయ అభివృద్ధి దాతలు, వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.



శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం చైర్మన్ ధరూర్ సతీష్ పటేల్.

..రేపటి నుంచి పోలేపల్లి ఎల్లమ్మ జాతర
..మూడు రోజులపాటు ఉత్సవాలకు ఏర్పాట్లు
..తరలిరానున్న లక్షలాది మంది భక్తులు
..13న పులకించిపోయే సన్నివేశంతో సిడే సంబురం

# కోరినవారికి కొంగు బంగారం





జాతరకు ముస్తాబైన పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం



ఆలయ కోనేరు



అమ్మవారిని ఊరేగించే రథం



బోనాలు సమర్పిస్తున్న భక్తులు(ఫైల్)

**దుద్యాల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** దుద్యాల మండలంలోని పోలేపల్లిలో ఎల్లమ్మ జాతర కు రంగం సిద్ధమైంది. ఈ నెల 12 నుంచి 16 వరకు ఉత్స వాలను ఘనంగా నిర్వహించనున్నారు. పోలేపల్లి ఎల్లమ్మ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తు ల విశ్వాసం. పోలేపల్లి వ్యవసాయ భూముల్లో స్వయంభుగా వెలసినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనికి సంబంధించి ఓ చారిత్రక కథనం ప్రచారంలో ఉంది. పూర్వం ఓ రైతు పొలం దున్నుతుండగా లోతుగా వెళ్లడంలేదని బరువు కోసం తన పొలంలోనే ఒక రాయిని వెతికి నాగలికి కట్టాడట. సాయంత్రం రాయితో సహా నాగలిని అక్కడే ఉంచి ఇంటికి వెళ్లాడట. మరుసటి రోజు వచ్చి చూడగా నాగలికి కట్టిన రాయి కనిపించకపోవడంతో పరిసరాల్లో వెతకగా.. దొరికిన చోటే పడిఉండటంతో ఆశ్చర్యపోయాడు. తీసుకువచ్చి మళ్లీ నాగలికి కట్టి పొలం దున్నాడు. మరుసటి రోజూ అదేతంతు చోటుచేసుకుంది. ఎల్లమ్మ దేవత రైతు కలలో సాక్షాత్కరించి తాను ఎల్లమ్మ దేవతగా చెప్పడంతో రాయినే దేవతగా భావించి అప్పటి నుంచి ఆ రైతు కుటుంబం పూజిస్తూ వస్తోంది. కాలక్రమేణ ఆలయ పునరుద్ధరణ, విగ్రహ పునఃప్రతిష్ట చేశారు. సుమారు 150 ఏళ్లుగా భక్తులు అమ్మవారిని పూజిస్తూ ఆపదలో ఉన్నవారి కోరికలు తీర్చాలంటూ వేడుకుంటున్నారు. 1979లో ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది. అప్పటి రంగారెడ్డి జిల్లా దాదాపూర్ నవాబుల కాలంలో అమ్మవారికి చిన్న ఆలయం నిర్మించగా.. ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

**పొరుగు రాష్ట్రాల నుంచి యాత్రికులు రాక**

మూడురోజుల పాటు ఘనంగా నిర్వహించే ఎల్లమ్మ జాతర కు లక్షలాది మంది తరలివస్తారు. ప్రత్యేకంగా నైవేద్యం వండి బోనమెత్తుతారు. కోళ్లు, మేకలు బలిచ్చి, కల్లు సాకతో మొక్కులు తీర్చుకుంటారు. ఏటా మహాశివరాత్రి పర్వదినానికి ముందు వచ్చే శుక్రవారం అమ్మవారి జాతర ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రధాన ఘట్టమైన సిడే కార్యక్రమాన్ని తిలకించేందుకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. రాష్ట్రంలో నిర్వహించే ఎల్లమ్మ జాతరల్లో ఇదే పెద్ద జాతర కావడం విశేషం.

**-సిడే విశిష్టత...**

గతంలో అమ్మవారి జాతరకు ఓ జోగినిని చెటుకు వేలాడదీసి తాడుతో గుంజుతూ ఆలయం చుట్టూ తిప్పేవారు. అలా తిప్పుతున్నప్పుడు భక్తులు పెద్ద ఎత్తున గవ్వల బండారు చల్లుతూ జేజేలు కొట్టేవారు. ఈ ఆచారాన్ని 2007లో అప్పటి ప్రభుత్వం నిషేధించింది. మహిళల ను చెట్టుకుకట్టి తిప్పడం చట విరుద్ధమని, తొట్టెలో కూర్చోబెట్టి రథాన్ని ఆలయం చుట్టూ తిప్పాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ తర్వాత కాలక్రమంలో ఈ ఆచారం మారింది. ప్రస్తుతం తొట్టెలో అమ్మవారి మూలవిరాట్‌ను ఉంచి తిప్పుతుంటే భక్తులు గవ్వల బండారు చల్లుతారు. ఈ ఘట్టాన్నే సిడేగా పిలుస్తారు.

**-బోనంతో మొక్కులు...**

మహిళలు మట్టి కుండా లేదా ఇత్తడి బిందె ను తీసుకొని చుట్టూ సున్నం పూసి 5 బొట్లు పెట్టి అందులో అన్నం, కుడుములు పెడతారు. వేప కొమ్మలతో కుండ ను బోనంగా అలంకరించి నెత్తిన పెట్టుకొని అమ్మవారి ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసి నైవేద్యం పెడతారు. కోళ్లు, మేకల ు బలిచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. 12వ తేది రాత్రి ఎల్లమ్మ దేవాలయం నుంచి పల్లకి సేవ నిర్వహిస్తారు. జల్ది బిందెతోపాటు గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా భజనలతో 13 శుక్రవారం తెల్లవారుజాము వరకు ప్రధాన ఆలయానికి చేరుకునేందుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం ప్రధాన ఘట్టమైన సిడే కార్యక్రమం లక్షలాది భక్తుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

**-దాతల సహకారం..**

ఎల్లమ్మ ఆలయం దాతల సహకారంతో అభివృద్ధి చెందుతోంది. పోలేపల్లికి చెందిన ముచ్చటి వెంకటేశ్ మూడెకరాల పొలాన్ని కొ నుగోలు చేసి అమ్మవారికి విరాళంగా అందించారు. గతంలో ఆలయం చుట్టూ సొంత డబ్బులతో సిమెంటు రహదారిని ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే దారిలో హకీంపేట్ వద్ద దాతలు ముఖ ద్వారం నిర్మించారు. ఇంకొందరు దాతలు ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం గదులు, కోనేరు నిర్మించారు.

ఈ నప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత సంవత్సరం ఉత్సవాలలో పాల్గొని ఆలయ అభివృద్ధికి సుమారు రూ. 2 కోట్ల నిధులు కేటాయించారు. ఆలయ పరిసరాల్లో 75 లక్షలతో సిసి రోడ్లు, 38 లక్షలతో వెజ్ అండ్ నాన్ వెజ్ షెడ్, 18 లక్షలతో మరుగుదొడ్లు, భక్తుల సౌకర్యార్థం రోడ్డు వెడల్పు తదితర కార్యక్రమాలు చేపట్టారు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం**

**ముచ్చటి వెంకటేష్. పోలేపల్లి ఆలయ చైర్మన్**



ముచ్చటి వెంకటేష్.

జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు, విద్యుత్, వైద్యం, తదితర ఏర్పాట్లకు సంబంధించిన ప నులు పూర్తయ్యాయి. ఆర్‌టిసి అధికారులు కోస్గి, తాండూరు, నారాయణపేట, పరిగి నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించ న్నారు.

## పత్తిలో అధిక సాంద్రత సాగు వల్ల అధిక దిగుబడి

**..శాస్త్రవేత్త డాక్టర్ మధుశేఖర్**

**పెద్దేముల్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** పత్తిలో అధిక సాంద్రత సాగు వల్ల మొక్కకు 8-10 కాయలు వచ్చిన మొక్కల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల ఎకరాకు10 నుంచి 12 క్వింటాళ్ళ దిగుబడి వచ్చె అవకాశం ఉందని తాండూరు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మధుశేఖర్ అన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ, పరిగిపత్తి కృషివికాస్ కేంద్రం అధ్వర్యంలో మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతువేదికలో అధిక సాంద్రత పత్తి సాగు పద్దతిపై రైతులకు శిక్షణకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా, మధుశేఖర్ మాట్లాడుతూ సాధారణ పత్తి సాగులో వరుసల మధ్య 90 సెంమీ మొక్కల మధ్య 90 సెంమీపెట్టినప్పుడు ఎకరానికి 4938 మొక్కలు వస్తాయని అన్నారు. అధిక సాంద్రత పత్తి సాగులో వరుసల మధ్య 90 సెం.మీ మొక్కల మధ్య 15 సెంటిమీటర్లువిత్తుకుంటే ఎకరాకు 29629 మొక్కలు వస్తాయని అన్నారు. ఈ పద్దతి కనీసం 2.5 కిలోల విత్తనాలు అవసరమైతే వర్షాధార తెలిక నేలలకు అనుకూలమనిఅన్నారు. ఇలాంటి నేలలో మొక్కలు ఎత్తు పెరగవని అన్నారు. మండల వ్యవసాయ అధికారి పవన్ ప్రీతమ్ మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగు వల్ల ఎకరాకు సుమారుగా 30 నుంచి 40 శాతము అధిక దిగుబడి పొందే అవకాశం ఉందని, అంతేగాకుండా గులాబి రంగు పురుగు ఉధృతి తక్కువగా ఉంటుందని అన్నారు. పంట కాలం 150-160 రోజులకి తగ్గించబడిందని, రెండు పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ సభ్యులుబుద్దారం వెంకటరెడ్డి, లక్ష్మన్, ఆదర్శ రైతులు రుద్రారం నారాయణ, కిషన్‌రావు, బుజ్జమ్మ, ఏఈఓలు ఆపర్ణ, చంద్రకళ, శ్రవన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త మధుశేఖర్



ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేస్తున్న మేక గూడ నాయకులు.

## నక్ష బాటను సర్వే చేయించండి

**ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేసిన మాజీ ఎంపిటిసి**

**నందిగామ, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** నందిగామ మండలం మేకగూడ నుండి ఇన్ముల్ నర్వ వరకు వెళ్లే నక్షబాటను సర్వే చేసి రహదారిని నిర్మించుకుంటామని మేకగూడ సర్పంచ్ రమావత్ మారు భర్త మాజీ ఎంపిటిసి రాజునాయక్, ఉపసర్పంచ్ ఎడ్ల శ్రీశైలం యాదవ్‌లు గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీలో గ్రామసభలో తీర్మానం అనంతరం ఎమ్మార్వోకు నక్షబాట విషయమై విన్నవించుకున్నట్లు పేర్కొన్నారు. నక్షబాటసర్వే అనంతరం రోడ్డువేసేందుకు తీర్మానంచేసినట్లు చెప్పారు. ఎమ్మార్వోను కలిసిన వారిలో మాజీ రైతుబంధు కోఆర్డి నేటర్ మెకం రాజు ముదిరాజ్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కుమ్మరి వెంకటేష్, మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్ యాదవ్ ,నందిగామ మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఏకుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలపునరుద్ధరణకు చర్యలు

**కరెంటు సమస్యపై ఆరా తీసిన విద్యుత్ అధికారులు**

**నందిగామ, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** నందిగామ మండలం అప్పారెడ్డి గూడ గ్రామపంచాయతీ లో మంగళ వారం విద్యుత్ ఎస్ సి శ్రీరామ్ ,డి ఎం శామ్ సుందర్ రెడ్డి లు సర్పంచ్ సి మల్లేష్, ఉప సర్పంచ్ సి ప్రభులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఏళ్లనాటి శిధిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను మార్చడమే కాకుండా, ఇళ్లపై వెళ్లిన, క్రిందికి వేలాడుతున్న ప్రమాదకర వైర్లను రెక్టిఫైచేసి తీసివేసే చర్యలను చేపట్టనునట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎడి రవీందర్, ఎఇ శ్రీధర్, లైన్ ఇన్స్పెక్టర్ రాజు , లైన్ మెన్ శ్రీశైలం, వార్డ్ సభ్యులు, గ్రామస్తులు తదితరులున్నారు.



## ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**ఎన్నికల పరిశీలకులు రవి ఐ.ఏ.ఎస్**

**పరిగి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులు,సిబ్బంది పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు ఉంటాయని ఎన్నికల పరిశీలకులు రవి ఐఎఎస్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను రవి పరిశీలించారు. నేడు జరగనున్న 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను , మునిసిపల్ ఎన్నికల సాధారణ అబ్జర్వర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్నికల సామాగ్రి పంపిణి కార్యక్రమంలో పాల్గొన్నారు..18 వార్డులకు గాను 38 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి,ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు..బ్యాలెట్ పత్రాలు, బాక్స్‌లు జాగ్రత్తగా పోలింగ్ కేంద్రాలకు తరలించారన్నారు. ఎక్కడ కూడా డబల్ ఓటింగ్ జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని,సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు, వచ్చిపోయేదారులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రూట్ల వారీగా బస్సులు బయలుదేరే విధంగా అధికారులు దగ్గరుండి పర్యవేక్షి ంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ వాసు చంద్ర మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, తహసీల్దార్ వెంకటేశ్వరి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు రవి ఐ.ఏ.ఎస్

## రేపటి నుండి కంకల్ గ్రామంలో
# శ్రీ వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన పూడూరు మండలం కంకల్ శ్రీ వీరభద్రేశ్వరస్వామి దేవాలయం

**పూడూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని కంకల్ గ్రామంలో వెలసిన శ్రీ వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు(జాతర కార్యక్రమాలు) ఈ నెల 12వ తేదినుండి 18వ తేదివరకు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటి సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వతేది గురువారం ధ్వజారోహణం, ఓం నమ: శివాయ , 13వతేది శుక్రవారం గీతాయజ్ఞము, పారా యణము ,14వతేది శనివారం మృత్యుంజయహోమం, రుద్రహోమం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు .15వతేది ఆదివారం మహాశివరాత్రి ,రుద్రాభిషేకం, 16వతేది సోమవారం తెల ్లవారు జామున అగ్నిగుండము ,17వతేది మంగ ళవారం శ్రీస్వామివారి రథోత్సవము, రాత్రికి వీరభద్ర విజయం (ఆటా) ఉంటుందని వివరించారు. 18వతేది బుధ వారం పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం ,రాత్రికిసేవా ,మానస పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ముగు స్తాయని అన్నారు. ఇట్టి ఉతవాలకు వివిధ జిల్లాల్లోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఆలయంలో కొలువుదీరిన శ్రీ వీరభద్రేశ్వరస్వామి




బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న బ్రాంచ్ మేనేజర్ మల్లయ్య గౌడ్.

## గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

**బ్రాంచ్ మేనేజర్ మల్లయ్య గౌడ్**

**మోమిన్‌పేట్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** ప్రతి వ్యక్తి తెలంగాణ గ్రామీణ బ్యాంకుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ మల్లయ్య గౌడ్ పేర్కొన్నారు. ఆర్ బీ ఐ ఆదేశాల మేరకు మంగళవారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని వెల్చాల్ గ్రామ పంచాయతి కార్యాలయ ఆవరణలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతు అన్ని బ్యాంకుల కంటే భిన్నంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా ప్రతి సౌకర్యం కల్పించడం జరిగిందని అన్నారు. గ్రామీణ బ్యాంకు యొక్క సేవల్లో భాగంగా ఖాతాదారులు సికేవైసి, కేవైసి, ఈకేవైసి చేయించుకోవాలని తెలిపారు. ఖాతాదారుల వయస్సును బట్టి అనేక రకాల బీమా సౌకర్యాలు, ప్రమాద బీమాలు, సాధారణ బీమాలు తదితర అంశాలపై కళాకారులచే అవగాహన కల్పించడం జరిగింది. అలాగే బ్యాంకు మేనేజర్ మల్లయ్య గౌడ్ మరియు ఫీల్డ్ అధికారి రాజేంద్ర ప్రసాద్‌లు మాట్లాడుతూ బ్యాంకు యొక్క సేవలను తెలియజేస్తూ అధికవడ్డీ, లాకర్ సౌకర్యం, అన్ని రకాల ఋణాలు ఇవ్వడంతో పాటు, నిరుద్యోగులకు ఆర్థికంగా ఎదిగి అభివృద్ధి చెందేందుకు వ్యక్తిగత ఋణాలు, డ్వాక్రా మహిళలకు పావులా వడ్డీతో అవసరమైన వ్యాపారం కోసం కూడా ఋణాలు ఇవ్వడంతో పాటు భీమా సౌకర్యం కల్పిస్తున్న ఏకైక బ్యాంకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు అని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు ఉపసర్పంచ్ రమేష్, బ్యాంకు సిబ్బంది రవీందర్ రెడ్డి, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, గ్రామస్తులు, వివిధ గ్రామాల ఖాతాదారులు, నాయకులు, యువకులు, పంచాయతి కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, పంచాయతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాకారులచే అవగాహన.



అవగాహన కార్యక్రమంలో వివిధ గ్రామాల ఖాతాదారులు.

